సాక్షి విశాఖపట్నం

సోమవారం । 30 । డిసెంబర్ । 2024



అలల చెంతన అందెల సవ్వడి

అలల చెంతన అందెల సవ్వడి విశాఖ వాసులను ఓలలాడించింది. బీచ్‌రోడ్డులోని ఎంజీఎం పార్క్ వేదికగా ఇంటర్నేషనల్ ట్రెడిషనల్ డ్యాన్స్ కాంగ్రెస్-2024లో భాగంగా చివరి రోజు ఆదివారం 1,500 మందికి పైగా కూచిపూడి కళాకారులతో బ్రహ్మాంజలి-మహాబృంద నృత్యం చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. 8లో



వావ్.. నేవీ షో

- కడలిపై కదన విన్యాసం
- జనసంద్రమైన సాగర తీరం







నేవీ విన్యాసాలు అబ్బురపరిచాయి. వీకెండ్ కావడంతో ఆదివారం పర్యాటకులు భారీగా తరలిరాగా..విన్యాసాలు వీక్షించి మధురానుభూతి పొందారు. సాగరతీరం యుద్ధవాతావరణాన్ని తలపించింది. నేవీ విన్యాసాల రిహార్సల్ ఆద్యంతం ఆకట్టుకున్నాయి. నౌకాదళ విన్యాసాలలో సాగర తీరం సంభ్రమాశ్చర్యాలకు కేంద్రంగా మారింది. నేవీ సాహసికులు ప్రదర్శించిన పలు విన్యాసాలు సందర్శకులకు కనువిందు చేశాయి. ప్రతి విన్యాసం అబ్బురపరిచింది. నింగి, నేలా తేడాలేదనేలా సాగిన ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకించిన ప్రజలు సరికొత్త అనుభూతిని పొందారు. యుద్ధ ట్యాంకర్లతో శత్రుసేనపై విరుచుకుపడిన విన్యాసాలు ఆకర్షణగా నిలిచాయి. గగన తలంపై భారత జాతీయ పతాకం, నావికాదళ పతాకాలను ఎగరేస్తూ హెలికాప్టర్ల ఆగమనంతో కార్యక్రమం ప్రారంభమైంది. సముద్రంలోనుంచి తీరానికి చేరుకోవడం, హెలికాప్టర్ల నుంచి సముద్రంలోనికి తాడు సాయంతో దిగడం, శత్రువులపై దాడి చేసి బందీలను విడిపించడం వంటి సన్నివేశాలు అబ్బురపరిచాయి. క్రమపద్ధతిలో చేతక్ హెలికాప్టర్లు, అడ్వాన్స్‌డ్ లైట్ హెలీకాప్టర్లు, హాక్స్ విమానాలు, డార్నియర్ హెలికాప్టర్, సీటింగ్ హెలికాప్టర్, యుద్ధవిమానాలు వ్యూహాత్మకంగా చేసిన విన్యాసాలు అందరి దృష్టిని ఆకట్టుకున్నాయి. నౌకలపై ప్రత్యేకమైన మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీప కాంతులు చిన్నారులను మైమరపింపజేశాయి. నావికాదళంలో పని చేసే సిబ్బంది జీవనాన్ని, విధులను వివరించే విధంగా సీ క్యాడెట్ కార్ప్స్ సంగీతానికి అనుగుణంగా నర్తించిన విధానం ఆహూతులను అలరించింది.

– ఏయూక్యాంపస్, ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



యుద్ధ ట్యాంకర్స్





విన్యాసాలు వీక్షిస్తూ..





విద్యుత్ వెలుగుల్లో నౌకలు



మెరైన్ కమాండోల విన్యాసాలు



నాటి అడుగులే.. నేటి పరుగులు

దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఐటీ కేంద్రంగా పురుడుపోసుకున్న వైజాగ్.. ఆయన మరణానంతరం దాదాపు పదేళ్లు కునారిల్లింది. మళ్లీ 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కసారిగా దూసుకెళ్లింది. ఇప్పుడు అధికారం మారి, కూటమి ప్రభుత్వ పాలన వచ్చాక మాటల్లోనే తప్ప ఎక్కడా ఐటీ అభివృద్ధి కనిపించడం లేదు. 2019 నుంచి 2024 మధ్య కాలం ఐటీ రంగానికి విశాఖలో స్వర్ణయుగమని స్వయంగా సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా(ఎస్‌టీపీఐ) గణాంకాలతో సహా ప్రకటించడం విశేషం.



ఇన్ఫోసిస్ కార్యాలయం

- తండ్రీ కొడుకుల పాలన.. వైజాగ్ సాఫ్ట్‌వేర్‌కి స్వర్ణయుగం
- గత ప్రభుత్వ హయాంలో గణనీయంగా ఐటీ ఎగుమతుల వృద్ధి
- 2019 నుంచి 2024 మధ్యలో 300 శాతం పెరిగిన ఎక్స్‌పోర్ట్స్
- ద్వితీయ శ్రేణి నగరాల్లో 5వ స్థానంలో విశాఖ
- వివరాలు వెల్లడించిన ఎస్టీపీఐ

విశాఖ ఎస్‌టీపీఐలో సాఫ్ట్‌వేర్ ఎగుమతులిలా..

సంవత్సరం	ఎగుమతులు (రూ.కోట్లలో)
2019-20	718.24
2020-21	781.9
2021-22	775.82
2022-23	917.02
2023-24	2,625.04

సాక్షి, విశాఖపట్నం: ఐటీ, ఐటీ అనుబంధ పరిశ్రమల ప్రగతిలో విశాఖ పరుగులు పెడుతోంది. ఇందుకు దివంగత మహానేత డా.వైఎస్సార్, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన చర్యలే కారణమంటే అతిశయోక్తి కాదు. గత సీఎం జగన్ బీచ్ ఐటీ డెస్టినీ కాన్సెప్ట్‌తో చేసిన ప్రమోషన్‌కు ఆకర్షితులై ఇప్పటికే పలు సంస్థలు తమ శాఖలను విశాఖలో విస్తరింపజేశాయి. ఇప్పుడవి ఫలాలనిస్తూ, ఐటీ రంగంలో విశాఖను ముున్ముందుకు తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి.

వైఎస్ తర్వాత.. జగన్ పాలనలోనే వృద్ధి

దివంగత వైఎస్సార్ హయాంలో మధురవాడలోని మూడు కొండల మధ్య 300 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన సెజ్‌లో తొలి దశలో ఇన్ఫోటెక్, సింబియాసిస్, మిరాకిల్, కెనెక్సా వంటి ప్రముఖ ఐటీ కంపెనీలు సహా మొత్తం 26 సంస్థలు తరలివచ్చాయి. రూ.1,800 కోట్లకు చేరుకున్న ఎగుమతులు వైఎస్సార్ మరణానంతరం 2014–19 వరకు చంద్రబాబు ప్రభుత్వంలో రూ.800 కోట్ల దిగువకు పడిపోయింది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక విశాఖలో ఐటీ అభివృద్ధిపై గత సీఎం వైఎస్ జగన్ దృష్టిసారించారు. అంతకు ముందున్న టీడీపీ ప్రభుత్వ హయాంలో బకాయి పడ్డ రూ.100 కోట్ల ప్రోత్సాహకాలను వెంటనే విడుదల చేశారు. అద్భుతమైన ఐటీ పాలసీని రూపొందించి దిగ్గజ సంస్థలను ఆకర్షించడంలో విజయవంతమయ్యారు. ఫలితంగా ఐటీ ఎగుమతులు గణనీయంగా వృద్ధి సాధించాయి.

అత్యుత్తమ ఫలితాల 'కల్పతరు'వు

ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు హబ్‌గా త్వరితగతిన అభివృద్ధి చెందేందుకు విశాఖలో అపారమైన అవకాశాలు ఏర్పడిన నేపథ్యంలో 2022లో ఎస్‌టీపీఐ 'కల్పతరు'కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఐటీ పరిశ్రమలన్నీ తమ తదుపరి డెస్టినేషన్‌గా ద్వితీయ శ్రేణి నగరాలను ఎంపిక చేసుకుంటున్న నేపథ్యంలో మొదటి వరుసలో విశాఖ ఉంది. 2022 తర్వాత ఐటీ సర్వీస్ సెక్టార్ పరిశ్రమల ఏర్పాటుకు వైజాగ్ వంటి నగరాలే మొదటి ప్రాధాన్యంగా మారాయి. చైనా, జపాన్ వంటి దేశాల పోటీని తట్టుకునేందుకు వైజాగ్ వంటి టైర్-2 నగరాలను దిగ్గజ సంస్థలన్నీ ఎంపిక చేసుకున్నాయి. స్టీల్‌ప్లాంట్‌లో కల్పతరు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీని రూ.20.32 కోట్లతో ఏర్పాటు చేసింది. దీని అభివృద్ధికి ఇప్పటి వరకూ రూ.12.77 కోట్లు ఖర్చు చేసింది.

ఎస్‌టీపీఐ కంపెనీల్లో ఎగుమతుల జోరు

ఐదేళ్ల కాలంలో ఎస్‌టీపీఐ పరిధిలో ఉన్న ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీల్లో ఎగుమతులు అద్భుతంగా పెరిగాయి. వైజాగ్‌లో ఐదేళ్ల కాలంలో ఎలా సాఫ్ట్‌వేర్ ఎగుమతులు అభివృద్ధి చెందాయన్నది ఎస్‌టీపీఐ విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఎస్‌టీపీఐ ఆధ్వర్యంలో నడుస్తున్న సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్(ఎస్‌టీపీ)ల్లో ఉన్న ఐటీ పరిశ్రమల్లో 2019–20 నుంచి ఎగుమతులు అనూహ్యంగా పెరిగినట్లు వెల్లడించింది. 2019–20 నుంచి 2023–24 మధ్య కాలంలో ఏకంగా 300 శాతానికి పైగా ఎస్‌టీపీల నుంచి ఎగుమతుల వృద్ధి జరిగినట్లు పేర్కొంది. కోవిడ్ సమయంలోనూ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్స్‌కు ఎలాంటి విఘాతం కలగకపోవడం గమనార్హం.

మరో 30 వేల చ.అ.ల విస్తీర్ణంలో..

బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్(బీపీవో) కంపెనీలు కూడా ద్వితీయ శ్రేణి నగరాల బాట పడుతున్నాయి. వీటి ఓటు కూడా వైజాగ్‌కేనని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా బీపీవో సీట్స్‌లో ఏపీ వాటా 27 శాతం కాగా.. విశాఖ వాటా 20 శాతం ఉండటం గమనార్హం. ఇది గత ప్రభుత్వం అందించిన ప్రోత్సాహకాలతోనే సాధ్యమైందనడంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో వైజాగ్‌లో ఎస్‌టీపీఐ సేవలు మరింత విస్తృతం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే ప్రస్తుతం ఉన్న కార్యాలయం కాకుండా మరో 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని 2023లో నిర్ణయించింది. రూ.18.95 కోట్లతో 4 అంతస్తుల్లో ఈ భవన నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభించేందుకు ఎస్‌టీపీఐ సన్నద్ధమవుతోంది.



రుషికొండ ఐటీ సెజ్

2023 నుంచి ఎస్‌టీపీఐ-విశాఖలో రిజిస్టర్ చేసుకున్న ఐటీ సంస్థల వివరాలు

కంపెనీ పేరు	ఎగుమతులు (రూ.కోట్లలో)	పెట్టుబడులు (రూ.లక్షల్లో)	ఉద్యోగాలు	ప్రాజెక్టు కాలపరిమితి
కేంబ్రిడ్జ్ సిస్టమ్స్ ఇండియా ప్రై.లి.	10.50	37	55	03
టెక్విజెన్స్ ఐటీ అండ్ స్టాఫింగ్ సొల్యూషన్స్ ప్రై.లి.	08	10	60	03
జెనిత్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్	3.50	10	19	03
రుత్విక్ ఇన్ఫోటెక్ ప్రై.లి.	0.60	01	62	03
టావ్ డిజిటల్స్ ఇండియా ప్రై.లి.	63	03	440	03
సిగ్నిటివ్ టవర్స్ ప్రై.లి.	20.8	8	207	03
ఇన్నోసిటో ప్రై.లి.	18.97	03	430	03
స్వెకెన్ ఐటీ సొల్యూషన్స్ ప్రై.లి.	06	50	495	03
పంచమి అసోసియేట్స్ ఎల్‌ఎల్‌పీ	16	60	57	03
ముదునూరు లిమిటెడ్	14.40	03	98	03
ఇన్ఫోసిస్ లిమిటెడ్	1443.38	41	1000	05

అప్పన్న సన్నిధిలో గాయకుడు కారుణ్య



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం సినీ గాయకుడు కారుణ్య దర్శించుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణలో వచ్చిన ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అంతరాలయంలో అష్టోత్తరం పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా కారుణ్య స్వామివారి కీర్తనలు ఆలపించారు.

'ఖైదీలు జైలు నిబంధనలు పాటించాలి'

ఆరిలోవ: జైలు నిబంధనలను ఖైదీలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా సెషన్స్ జడ్జి ఆలపాటి గిరిధర్ తెలిపారు. విశాఖ కేంద్ర కారాగారాన్ని ఆదివారం జిల్లా న్యాయమూర్తితో పాటు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సందర్శించారు. జైల్లో శనివారం జరిగిన వార్డర్ల ఆందోళనపై ఆరా తీశారు. అనంతరం ఖైదీలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా న్యాయమూర్తి, సీపీ మాట్లాడుతూ జైలు లోపలకి గంజాయి, మొబైల్ ఫోన్‌లు, బీడీలు తదితర నిషేధిత వస్తువులు తీసుకురావడం , వినియోగించడం చేయకూడదన్నారు. వీటిని కలిగి ఉన్నవారిపై చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రౌడీ షీట్లు ఉన్న ఖైదీలు మంచి ప్రవర్తనపై విడుదలవ్వాలని సూచించారు. అలాంటివారికి నైపుణ్యం ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. జైళ్ల శాఖ డీఐజీ ఎంఆర్ రవికిరణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఈ–ములాఖత్, ఫిజికల్ ఇంటర్వ్యూలను వినియోగించుకుని కుటుంబ సభ్యులతో మంచి సంబంధాలు కొనసాగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జైలు పర్యవేక్షణాధికారి ఎం.మహేష్‌బాబు, డీఎస్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి. చిత్రంలో జిల్లా న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదా !

- ఎంపీ శ్రీభరత్ ఆశ్చర్యం
- కంగుతిన్న ప్లాంట్ నేతలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదన్న విషయం తెలిసి ఎంపీ శ్రీభరత్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎంపీ సమాధానానికి స్టీల్‌ప్లాంట్ నాయకులు నివ్వెరపోయారు. జీతాలు చెల్లించని విషయం ఎంపీ దృష్టికి పలుమార్లు స్టీల్‌ప్లాంట్ నాయకులు తీసుకువెళ్లినప్పటికీ పై విధంగా మాట్లాడడంతో ప్లాంట్ నేతలు కంగుతిన్నారు. అక్టోబర్‌లో 50 శాతం, నవంబర్‌లో 35 శాతం బకాయి పెట్టగా ఈ నెల ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కొంత శాతం జీతం అయినా ఇవ్వాలి కదా..లేకపోతే ఉద్యోగులు ఇబ్బంది పడతారు కదా అంటూ ఎంపీ మాట్లాడారు. ఈ విషయంపై ఉక్కు మంత్రి దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. జీతాలపై ఉక్కు మంత్రితో మాట్లాడి తదుపరి ముఖ్యమంత్రితో చర్చిస్తామని తెలిపారు.

నేడు జీవీఎంసీలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు మేయర్ హరి వెంకటకుమారి,కమిషనర్ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై స్పష్టమైన ప్రకటన చేయాలి

- లేకపోతే ప్రధాని విశాఖ పర్యటనను అడ్డుకుంటాం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పెందుర్తి: స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తామని.. సొంత గనులు కేటాయించి ప్రభుత్వ ఆధీనంలోనే నడుపుతామని ప్రధాని మోదీతో ప్రకటన చేయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆ తర్వాత ప్రధాని విశాఖలో పర్యటించాలన్నారు. అలా చేయకపోతే విశాఖ ప్రజలంతా ఏకమై ప్రధాని పర్యటనను అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సుజాతనగర్‌లో ఓ కల్యాణమండపంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. గతంలో అనేక సందర్భాల్లో విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధాని విశాఖ ఉక్కుపై ఎలాంటి ప్రకటన చేయకుండా తప్పించుకున్నారని ఆరోపించారు. ఓ వైపు బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని ప్రజలను మభ్యపెడుతుంటే.. కేంద్ర ప్రభుత్వం చాపకింద నీరులా ప్రైవేటీకరణ పనులు చక్కబెట్టుకుపోతోందని ఆరోపించారు. మిట్టల్ కంపెనీ కోసం స్టీల్‌ప్లాంట్‌ను బలిచేయడం తగదన్నారు. రుషికొండపై గత ప్రభుత్వం నిర్మించిన భవనాన్ని సైన్స్ మ్యూజియంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సింహాచలం దేవస్థానం భూ సమస్యను ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. నిరుపేదలకు స్థలాలు, ఇళ్లు ఇవ్వకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ప్రభుత్వం కొమ్ము కాస్తోందని ఆరోపించారు. నిరుపేద జీవితాలతో ప్రభుత్వాలు ఆడుకుంటే తాము ఊరుకోబోమని.. ప్రజల తరఫున సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావ్, బి.జగన్, జిల్లా కమిటీ సభ్యులు బి.రమణి, బి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం!

- స్నేహితుడిని కలిసేందుకు వెళ్తూ.. విద్యార్థి దుర్మరణం
- మరో విద్యార్థికి గాయాలు





దువ్వి సాకేత్ మృతదేహం, సాకేత్(ఫైల్)



మహర్షి(ఫైల్)

కొమ్మాది/అక్కిరెడ్డిపాలెం: స్నేహితుడిని కలిసేందుకు వెళ్తూ బీచ్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బీబీఏ విద్యార్థి మృతి చెందాడు. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి ఆరిలోవ ఎస్‌ఐ రామదాసు తెలిపిన వివరాలివీ.. రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేస్తున్న చిన అక్కిరెడ్డిపాలేనికి చెందిన దువ్వి వెంకటేష్ పెద్ద కుమారుడు దువ్వి సాకేత్(18) ఎంవీపీకాలనీలోని ఓ కళాశాలలో బీబీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. అక్కిరెడ్డిపాలెంలోని నూకాలమ్మ ప్రాంతానికి చెందిన తలారి సాయి మహర్షి అనకాపల్లిలో రెండో సంవత్సరం డిప్లమో అభ్యసిస్తున్నాడు. ఇద్దరూ కలిసి ఆదివారం ఉదయం 6 గంటలకు ఎండాడలో ఉన్న స్నేహితుడిని కలిసేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. సాగర్‌నగర్ వద్ద ప్రభుత్వ అంధబాలికల పాఠశాలకు ముందు మలుపు తిరుగుతుండగా.. అతి వేగం కారణంగా ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న సాకేత్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న సాయి మహర్షికి తలకు తీవ్ర గాయాలు కావడంతో రుషికొండలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో.. వారు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సాకేత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామదాసు తెలిపారు. అతివేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనతో చినఅక్కిరెడ్డిపాలెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సాకేత్ కుటుంబం వాల్తేర్ నుంచి వచ్చి చినఅక్కిరెడ్డిపాలెంలో స్థిరపడింది.

రేపు జాబ్ మేళా

మురళీనగర్:కంచరపాలెంలోని ఉపాధి కార్యాలయంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి శిక్షణ అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. మేళాలో నిపునా ఇంజినీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్, హెచ్‌డీబీ ఫైనాన్స్, మెడిప్లస్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ ఎలక్ట్రీషియన్, ఏదైనా డిగ్రీ, డిప్లమో ఎలక్ట్రికల్ పూర్తిచేసిన వారు అర్హులు. మరిన్ని వివరాలకు 9948768778 నంబర్‌లో సంప్రదించవచ్చు.







అలల చెంతన అందెల సవ్వడి

- కనులపండువగా బ్రహ్మాంజలి
- శాస్త్రీయ నృత్య ఘోషతో విశాఖ సాగరతీరం పులకింత

ఏయూక్యాంపస్: అలల చెంతన అందెల సవ్వడి విశాఖ వాసులను ఓలలాడించింది. బీచ్‌రోడ్డులోని ఎంజీఎం పార్క్ వేదికగా ఇంటర్నేషనల్ ట్రెడిషనల్ డ్యాన్స్ కాంగ్రెస్–2024లో భాగంగా చివరి రోజు ఆదివారం 1,500 మందికి పైగా కూచిపూడి కళాకారులతో బ్రహ్మాంజలి–మహాబృంద నృత్యం చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన కళాకారులు ఒకే వేదికపై పాదం కలిపారు. కూచిపూడిని నాటి నుంచి నేటి వరకు విశ్వవ్యాప్తం చేసిన గురువులందరినీ స్మరించుకుంటూ ఈ నృత్య నివేదన చేశారు. ఈ సందర్భంగా సిద్ధేంద్ర కళాక్షేత్రం పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి మాట్లాడుతూ విశాఖ, కాకినాడ, కూచిపూడి, గుంటూరులో ఇటువంటి బృహత్ కార్యక్రమాలు జరగడం సంతోషం కలిగిస్తోందన్నారు. ఇది జ్ఞాన అధ్యయనానికి ఉపకరించే కళ అని అన్నారు. బాలురు కూడా కూచిపూడి నృత్యాన్ని అభ్యసించాలని సూచించారు. సంస్కారవంతమైన మార్గంలో చిన్నారులను నడిపించాలని తల్లిదండ్రులను కోరారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ కళాకృష్ణ మాట్లాడుతూ కూచిపూడి నృత్యం నేడు విశ్వవ్యాప్తం అయిందన్నారు. కళలు సంస్కృతిని చాటుతాయన్నారు. కూచిపూడి నృత్య గురువు పి.సుధీర్ రావు మాట్లాడుతూ చిన్నారులను కళల దిశగా నడిపించే బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. మంచి గురువును ఎంపిక చేసుకుని శ్రద్ధతో నేర్చుకోవాలన్నారు. కళారత్న కె.వి.సత్యనారాయణ మాట్లాడుతూ నగరంలో నిర్వహిస్తున్న మూడు రోజుల వేడుక భారతీయ నృత్య, సాంస్కృతిక వైభవాన్ని చాటిందన్నారు. రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ విశాఖ నగరం ఎంతో పుణ్యం చేసుకుందన్నారు. కార్యక్రమ సంచాలకుడు బత్తిన విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన సందీప్ బృందం పేరిణి నృత్యం, కళాకృతి బృందం కావడి నృత్యం, కళాకృతి బృందం కరగాట్టం నృత్యం, కోల్‌కతాకు చెందిన అనురేఖా బృందం కథక్ నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఒడిశా, ఢిల్లీకి చెందిన కళాకారులు పలు నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో విభిన్న ప్రాంతాల నుంచి హాజరైన నాట్య గురువులను వేదికపై సత్కరించి, పురస్కారాలు ప్రదానం చేశారు.

కిమ్స్ ఆస్పత్రికి నోటీసులు

సీతమ్మధార: కిమ్స్(ఎస్‌ఆర్‌ఐ) ఆసుపత్రికి వీఎంఆర్డీఏ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. సీతమ్మధారలోని బీఎస్ లేఅవుట్‌లో ఉన్న ఎస్‌ఆర్‌ఐ ఆసుపత్రిని మూడు నెలల కిందట కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి యాజమాన్యం టేకోవర్ చేసింది. ఆసుపత్రి నిర్మాణానికి గానూ అప్పటి వుడా (వీఎంఆర్‌డీఏ) ఎస్‌ఆర్‌ఐ యాజమాన్యానికి గజం రూ.270 చొప్పున భూమిని కేటాయించింది. అప్పటి ఒప్పందం ప్రకారం ఆసుపత్రిలో 10 నుంచి 20 శాతం మంది రోగులకు ఉచిత వైద్యం అందించాలి. ఆసుపత్రిలో 300 పడకలు ఉన్నందున, దాదాపు 60 పడకలను ఉచిత వైద్యానికి కేటాయించాల్సి ఉంది. ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్‌కు ఇటీవల లేఖ రాశారు. ఈ నేపథ్యంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ ఆసుపత్రికి నోటీసులు జారీ చేస్తూ, ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు 6 వరకు గడువు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ–చెన్నై ఆధ్వర్యంలో 2025 ఫిబ్రవరి 8,9వ తేదీలలో జరుగనున్న హిందీ హయ్యర్, లోయర్ పరీక్షలకు సంబంధించి రూ.10 అపరాధ రుసుంతో జనవరి 6 వరకు గడువు పెంచినట్టు భీమిలి ఆదర్శహిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. సెప్టెంబరు 14,15వ తేదీలలో జరిగిన పరీక్షలకు సంబంధించి ఉత్తర్ణులైన హయ్యర్, లోయర్ విద్యార్థుల సర్టిఫికెట్లను ఈ సందర్భంగా పంపిణీ చేశారు. మిగిలిన వివరాల కోసం 8985647419, 8985897419లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల బోధనలో మెలకువలపై శిక్షణ

- 40 రోజుల పాటు ప్రభుత్వ టీచర్లకు ఆన్‌లైన్ శిక్షణ తరగతులు



ఆంగ్ల శిక్షకుడు రామేశ్వర్‌గౌడ్, ఎస్ఎస్ఏ ఏఎంవో జి.లక్ష్మిలతో ఉపాధ్యాయులు

కంచరపాలెం: జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆంగ్ల భాష నైపుణ్యాలు, ఆంగ్ల మాధ్యమ బోధనలో మెలకువలపై ఆదివారం శిక్షణ నిర్వహించారు. జ్ఞానాపురం జూబ్లీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన ఈ శిక్షణకు జిల్లాకు చెందిన వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులు సుమారు 300 మంది పాల్గొన్నారు. విల్ టు కెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ డైరెక్టర్ రామేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సును ఎస్ఎస్ఏ అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి(ఏఎంవో) జి.లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామేశ్వర్‌గౌడ్ ద్వారా 40 రోజుల ఉచిత ఆన్‌లైన్ స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులు ఆంగ్ల మాధ్యమ బోధన మరింత సులభంగా చేసేలా ఈ శిక్షణ దోహదపడనుందన్నారు. ఈ శిక్షణ ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి మాతృభాష తెలుగు మాట్లాడినట్లే.. ఇంగ్లిష్ కూడా మాట్లాడేలా టీచర్లు తమ వంతు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు శ్రద్ధగా తరగతులకు హాజరు కావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. సంస్థ డైరెక్టర్ రామేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలోని 33 జిల్లాల్లో 53 వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఏపీలో కూడా తొలిసారిగా విశాఖ జిల్లా విద్యాశాఖ సహకారంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రామేశ్వర్ గౌడ్‌ను విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సత్కరించారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్

- భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు



సూర్యారావు(ఫైల్)



సూర్యారావును ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

సబ్బవరం: అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారి, అమ్ములపాలెం జంక్షన్ సమీపంలోని సర్వీస్ రోడ్డులో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, ఏఎస్‌ఐ టి.రవికుమార్ తెలిపిన వివరాలివీ.. మండలంలోని నారపాడు శివారు బలిజపాలేనికి చెందిన కోసూరి సూర్యారావు (48) సబ్బవరంలో టైలర్‌గా పనిచేస్తున్నారు. ఆయన భార్య మంగమ్మ బలిజపాలెంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ వీఆర్పీగా విధులు నిర్వహిస్తున్నారు. సూర్యారావు ఆదివారం ఉదయం టైలరింగ్ పని నిమిత్తం సబ్బవరం వచ్చారు. మంగమ్మ మధ్యాహ్నం సబ్బవరంలోని సంతకు వెళ్లారు. ఇద్దరూ కలిసి రాత్రి 7 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా.. అమ్ములపాలెం సమీపంలో వెనుకనే వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలు ఇద్దరూ రోడ్డుపై పడి, తీవ్రంగా గాయపడ్డారు. ఏఎస్‌ఐ రవికుమార్, స్థానికుల సహాయంతో క్షతగాత్రులను అంబులెన్స్‌లో అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలిస్తుండగా సూర్యారావు మృతి చెందారు. మంగమ్మ అపస్మారక స్థితిలో ఉన్నారు. వారికి వివాహమైన కుమార్తె ప్రసన్న, టెక్ చదువుతున్న కుమారుడు భార్గవతేజ ఉన్నారు. బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్ డ్రైవర్ పరారీ కావడంతో.. సీసీ ఫుటేజీ పరిశీలించి పట్టుకుంటామని సీఐ పిన్నింటి రమణ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

సీపీకి హోంగార్డ్స్ యూనిట్ కృతజ్ఞతలు

అల్లిపురం: సిటీ హోంగార్డ్స్ యూనిట్‌లో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారు. ఈ మేరకు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ యూనిట్ సభ్యులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. '2011 నుంచి వాయిదా పడుతూ వస్తున్న హోంగార్డ్స్ పదోన్నతుల పరీక్షలు నిర్వహించి 25 మందికి పదోన్నతులు కల్పించారు. దాదాపు వెయ్యి మంది హోంగార్డ్స్, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న దాదాపు 22 మంది హోంగార్డ్స్‌ను గుర్తించి వారి నివాసాలకు సమీపంలోని పోలీస్ స్టేషన్లలో విధులు కేటాయించి మానసిక స్థైర్యం నింపారు. మహిళా హోంగార్డ్స్‌కు రాత్రి విధులు లేకుండా ఆదేశాలు జారీ చేశారు. సిటీ హోంగార్డ్స్ చరిత్రలో అతి తక్కువ వ్యవధిలో రెండుసార్లు దర్బార్ నిర్వహించారు' అని ప్రకటనలో పేర్కొన్నారు. తమ సమస్యలను సీపీ దృష్టికి తీసుకెళ్లడంలో సహాయపడిన ఆర్‌ఐ కోటేశ్వరరావుకు యూనిట్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేటితో ముగియనున్న మార్గశిర మాసోత్సవాలు



కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల 28వ రోజు ఆదివారం అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. పంచామృతాభిషేక సేవలో 8 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు సోమవారంతో ముగియనున్నాయి. ముగింపు సందర్భంగా ఉదయం మాల విరమణ మాతలతో శాంతి హోమం, సాయంత్రం 6.30 గంటలకు సహస్రదీపాలంకరణ నిర్వహించనున్నారు.

కేజీహెచ్‌లో 24 గంటలూ అత్యవసర సేవలు



మాట్లాడుతున్న డాక్టర్ శివానంద్

మహారాణిపేట: కేజీహెచ్‌లో 24 గంటలూ అత్యవసర సేవలు అందిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. ఆదివారం కేజీహెచ్ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కార్డియాలజీ, యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, పీడియాట్రిక్స్‌లతోపాటు క్యాన్సర్ చికిత్సల వంటి మరెన్నో సూపర్ స్పెషాలిటీ సేవలు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆస్పత్రిలో అన్ని సేవలు ఉచితంగా అందజేస్తున్నామని, ఎవరైనా డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయడానికి కమాండ్ కంట్రోల్ రూమ్(0891-2590100, 0891-2590102) ఏర్పాటు చేశామన్నారు. క్యాన్సర్ రోగుల కోసం రూ.16 కోట్లతో అత్యాధిక లినాక్ మిషన్ త్వరలో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. క్యాన్సర్ నిర్ధారణ కోసం సీఎస్ఆర్ బ్లాక్ మొదటి అంతస్తులో ఓపీ 222 ఏర్పాటు చేశామని, వారానికి రెండు రోజులు ఓపీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆస్పత్రిలో 190 సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయని, మరో 100 కెమెరాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. కేజీహెచ్ ప్రధాన గేటు వద్ద 50 పడకల సామర్థ్యంతో కొత్త క్యాజువాలిటీ విభాగం ఏర్పాటు చేస్తున్నామని, రూ.35 కోట్లతో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సీఎస్ఆర్ నిధులతో నిర్మాణం జరుగుతుందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ న్యూఢిల్లీ సహకారంతో సికిల్ సెల్ వ్యాధికి జన్యుపరీక్షలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని, ఆ వ్యాధి నిర్ధారణ కోసం రూ. 6.30 కోట్లు కేంద్రం మంజూరు చేసిందన్నారు. కేజీహెచ్‌లో వాస్కులర్ సర్జరీ విభాగం ఏర్పాటైందని, వారానికి మూడు రోజులు వైద్యనిపుణులు అందుబాటులో ఉంటారని డాక్టర్ శివానంద్ వెల్లడించారు. సమావేశంలో సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ మోహర్ కుమార్ పాల్గొన్నారు.

ట్రయాథ్లాన్‌లో శేఖర్, వంశీ సత్తా

విశాఖ స్పోర్ట్స్: సీనియర్ అంతర్ జిల్లాల ట్రయాథ్లాన్ జట్ల ఎంపిక పోటీల్లో శేఖర్ ప్రథమ స్థానంలో నిలవగా, వంశీ ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నాడు. ట్రయాథ్లాన్ సంఘం ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం ఈ ఎంపికలు నిర్వహించగా, నాలుగు జిల్లాల నుంచి తొమ్మిది మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా 750 మీటర్ల స్విమ్మింగ్, 20 కిలోమీటర్ల సైక్లింగ్‌తో పాటు 5 కిలోమీటర్ల పరుగును నిర్వహించారు. సి.హెచ్.శేఖర్ గంటా 16 నిమిషాల 1 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసి మొదటి స్థానంలో నిలిచాడు. కె.వంశీ కిరణ్ గంటా 20 నిమిషాల 45 సెకన్లలో పూర్తి చేయగా, కె.కృష్ణచైతన్య గంటా 24 నిమిషాల 11 సెకన్లలో పూర్తి చేసి తర్వాతి రెండు స్థానాల్లో నిలిచారు. జాతీయ క్రీడల్లో రాష్ట్ర జట్టుగా పాల్గొనేందుకు వీరికి అర్హత కల్పిస్తామని సంఘం అధ్యక్షుడు ప్రసన్న కుమార్ తెలిపారు.

జాతీయ పోటీలకు నలుగురు ఎంపిక



ఎంపికైన కయాకర్‌లు

విశాఖ స్పోర్ట్స్: జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు రాష్ట్రం తరఫున నలుగురు కయాకర్‌లు ఎంపికయ్యారు. పురుషుల కానో స్లాలోమ్‌లో కాంస్యం సాధించిన ఎన్.రాజేష్‌తో పాటు ఎస్.గాయత్రి, డి.చేతన భగవతి, కె.విష్ణు ఎంపికై న వారిలో ఉన్నారు. ఉత్తరాఖండ్‌లోని శివపురి, రిషికేష్‌లలో జరిగిన ఆల్‌ఇండియా కానో స్లాలొమ్ చాంపియన్‌షిప్, కయాక్ క్రాస్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో వీరు పాల్గొన్నట్లు రాష్ట్ర కనోయింగ్, కయాకింగ్ సంఘం అధ్యక్షుడు బలరామ్ నాయుడు తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ప్రోత్సాహంతో వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధిలో భాగంగా వీరంతా 38వ జాతీయ క్రీడల్లో పాల్గొంటారని ఆయన వెల్లడించారు.

నేటి నుంచి నేషనల్ సింపోజియం

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో కెమికల్ అండ్ ఫార్మసీ కంపెనీల్లో ప్రమాదాల నివారణపై నేషనల్ సింపోజియం సోమవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు గైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. ఫైర్ సర్వీసెస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, కార్మిక శాఖ సంయుక్త సహకారంతో ఈ సింపోజియం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐఐటీ, ఐఐపీ, ఐఐసీహెచ్ఈ, ఏఐసీటీఈ, ఎన్‌బీటీ సంస్థల అకడమిషియన్లు, ఫ్యాక్టరీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా కెమికల్ ఇంజినీరింగ్‌లో 34 ఏళ్ల సేవలందించి ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న డాక్టర్ బీవీ లక్ష్మణరావును సత్కరిస్తామన్నారు.

వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృత్యువాత



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు(ఇన్‌సెట్) మసేను(ఫైల్)

పరవాడ: చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్య కార్మికుడు ప్రమాదవశాత్తు సముద్రంలో పడి మృతి చెందాడు. ఈ ఘటనతో ముత్యాలమ్మపాలెంలో విషాదం నెలకొంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివీ.. ముత్యాలమ్మపాలెం శివారు దిబ్బపాలేనికి చెందిన కొవిరి మసేను (30) తోటి మత్స్యకారులతో కలిసి ఆదివారం తెల్లవారుజామున సముద్రంలో చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు మసేను సముద్రంలో పడిపోయాడు. తోటి మత్స్యకారులు అతడి కోసం గాలింపు చేపట్టగా, కొంత సమయానికి అతని మృతదేహం లభ్యమైంది. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న మసేను హఠాత్తుగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. అతనికి భార్య సత్యవతి, ఏడేళ్ల కుమార్తె దుర్గ, నాలుగేళ్ల కుమార్తె మౌసిక ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ సీహెచ్ సుజాత ముత్యాలు, ఎంపీటీసీ దేవి రవి, గ్రామ పెద్దలు పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. సమాచారం అందుకున్న పరవాడ సీఐ ఆర్. మల్లికార్జునరావు గ్రామాన్ని సందర్శించి ప్రమాద వివరాలు సేకరించారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.


అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన బాలబాలికలు

గాజువాక: కర్నూలులో వచ్చే నెల 4, 5, 6 తేదీల్లో నిర్వహించనున్న ఎం.రంగారావు మెమోరియల్ 50వ అంతర్ జిల్లాల బాలబాలికల కబడ్డీ పోటీలకు విశాఖ జిల్లా జట్లను ఆదివారం ఎంపిక చేశారు. గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు బాలుర జట్టులో స్థానం కోసం 80 మంది క్రీడాకారులు, బాలికల జట్టులో స్థానం కోసం 60 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. వీరిలో నుంచి 20 మంది బాలురును, 20 మంది బాలికలను ప్రాథమికంగా ఎంపిక చేశారు. వీరికి గాజువాక ఉన్నత పాఠశాలలో శిక్షణ నిర్వహించిన అనంతరం ఒక్కో జట్టుకు 12 మంది చొప్పున తుది ఎంపిక చేస్తామని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ నిర్వాహక కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ రిఫరీ బోర్డు చైర్మన్ పి.అప్పారావు, సీనియర్ కోచ్ ఉమా శంకర్ బాబు, సీనియర్ క్రీడాకారులు వి.బాబూరావు, పి.వి.రమణ, వి.పైడిరాజు, పి.బాబూరావు, ఎస్.మంగరాజు, వి.నిరుపమ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మేళా నేటికి పొడిగింపు



సందర్శకులతో కిటకిటలాడుతున్న మేళా ప్రాంగణం

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్వాక్రా ఉత్పత్తుల మేళా విక్రయాలను మరో రోజు పొడిగించారు. ఈ మేరకు జీవీఎంసీ కమిషనర్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎంవీపీకాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో జరుగుతున్న ఈ మేళా ఐదవ రోజు కూడా ఉత్సాహంగా కొనసాగింది. నగరవాసుల నుంచి విశేష స్పందన రావడంతో.. విక్రయాలను మరో రోజు పొడిగించారు. సోమవారం ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు ఉంటాయి.. కాగా.. ఆదివారం ఉదయం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మేళాను సందర్శించారు. ఆయన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కూచిపూడి, భరతనాట్యం వంటి నృత్యాలతో కళాకారులు చేసిన ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ యూసీడీ పీడీ సత్యవేణి, పీవో రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.